క్లుప్తంగా

వేగనిరోధకాల ఏర్పాటు



స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోకి ప్రవేశించే ముఖద్వారం సమీపంలో శనివారం రెండు వేగనిరోధకాలను ఏర్పాటు చేశారు. వాహనాల వేగనియంత్రణకు స్టాపర్లు ఏర్పాటు చేసినట్లు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్సై ఎస్.షణ్ముఖరావు తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఉన్నారు.

ప్రశాంతంగా హిందీ ప్రచారసభ పరీక్ష



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ పరీక్షలు శనివారం నిర్వహించారు. విశారద, భూషన్, విద్వాన్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించగా..51 మంది హాజరైనట్లు హెచ్ఎం, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శంకరరావు తెలిపారు. మొత్తం 57 మంది పేర్లు నమోదు చేసుకోగా ఆరుగులు గైర్హాజరైనట్లు చెప్పారు.

విద్యార్థినులతో పొలం పనులా..?

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఓ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు తన పొలంలో పనుల కోసం సుమారు 10 మంది విద్యార్థినులను తన కుమారుడి(డ్రైవర్)తో పాటు కారులో శనివారం ఉదయం తరలించినట్లు సమాచారం. అయితే మార్గమధ్యలోని ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు ఆ కారును నిలిపి విచారించగా.. వారంతా ఆశ్రమ పాఠశాల విద్యార్థినులని తెలియడంతో వారిని పాఠశాలకు పంపించేశారు. ఈ సమాచారం తెలుసుకున్న పలు గిరిజన సంఘాల నాయకులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట ఎస్సై షణ్ముఖరావు వద్ద ప్రస్తావించగా.. వాహనంలో పరిమితికి మించి ప్రయాణం చేస్తుండటంతో వారిని ఆపి విచారణ చేయగా వారు ఆశ్రమ పాఠశాల విద్యార్థినులని చెప్పడంతో తిరిగి వెనక్కి పంపించేసినట్లు చెప్పారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న ఔత్సాహికులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా శిక్షకులు కె.జనార్దనరావు అన్నారు. స్థానిక రుషీ యోగా కేంద్రంలో శనివారం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక యుగంలో సగటు మనిషి ఒత్తిడి కారణంగా అనారోగ్యం పాలవుతున్నట్లు పేర్కొన్నారు. యోగా సాధన చేయటం వలన మానసిక ప్రశాంతత, ఒత్తిడిని జయించే శక్తి లభిస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వీరఘట్టం విద్యార్థిని



సంజన

వీరఘట్టం: శ్రీకాకుళంలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.సంజన సత్తాచాటింది. శనివారం జరిగిన 3 కిలో మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు శిర్లాపు ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈనెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో ఆమె పాల్గొంటుందన్నారు. పాఠశాల హెచ్ఎం బి.సాంబర, ఉపాధ్యాయులు కల్లూరి శివకుమార్, సుధీర్, గర్భాన శ్రీనివాసరావు తదితరులు సంజనను అభినందించారు.

క్లాత్ శానిటరీ ప్యాడ్స్ వినియోగంపై అవగాహన

భామిని: మండలంలోని మూలగూడ గ్రామంలో హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు గుడ్డ శానిటరీ ప్యాడ్‌లపై శనివారం అవగాహన కల్పించారు. సింథటిక్ ప్యాడ్‌లను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. భామినిలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ కేంద్రంలో గుడ్డ శానిటరీ ప్యాడ్‌ల తయారీపై శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శ్రీవిద్య తెలిపారు. అక్కడ తయారైన గుడ్డ శానిటరీ ప్యాడ్స్ బ్యాంక్‌ను మూలగూడలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ప్రభుత్వ బడి.. కొత్త ఒరవడి



సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల



డిజిటల్ తరగతుల నిర్వహణ



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దేశనాయకుల విగ్రహాలు



తాగునీటి సౌకర్యం



వెస్ట్రన్ మరుగుదొడ్డి

సీతంపేట:

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తోంది. అదనపు భవనాలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణంతో పాటు బెంచీలు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం, బ్లాక్‌బోర్డుల ఏర్పాటు, డిజిటల్ విధానంలో బోధనలకు అధునాతన తరగతి గదులు నిర్మాణం తదితర అన్ని వసతులను కల్పిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా, అధునాతనంగా తీర్చిదిద్దింది. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు సుమారు 635 మంది విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాల ఆవరణంలో పూల తోటలు, ప్రముఖుల విగ్రహాలు వంటివి ఆకట్టుకుంటున్నాయి.

తల్లీబిడ్డ చల్లగా.. ఆరోగ్యం మెండుగా..



గర్భిణికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డీఐఓ

- క్షేత్రస్థాయిలో విస్తృత వైద్యసేవలు
- మాతాశిశు మరణాలు తగ్గించడమే సర్కారు లక్ష్యం
- నెలలో 9, 10 తేదీల్లో ప్రత్యేక వైద్య సేవలు
- గిరి శిఖరాల్లో గర్భిణులకు అవగాహనా కార్యక్రమాలు

పాలకొండ రూరల్:

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాయి. ఇప్పటికే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాయి. తల్లీబిడ్డకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు ప్రోత్సహించేందుకు, మాతాశిశు మరణాల నివారణకు పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. గర్భిణీగా పేరు నమోదు చేసుకున్నప్పటి నుంచి ప్రతీ నెల ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడంతో పాటు హైరిస్క్ గర్భిణులకు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు. ఆయా పథకాలు, ప్రయోజనాలు, వైద్య సేవలపై ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్..

ప్రతీ నెల 9,10 తేదీల్లో గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి ప్రత్యేక పర్యవేక్షణలో మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వఅభియాన్ లక్ష్యం. దీని ద్వారా గర్భిణుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేలా అవగాహన కల్పిస్తారు. మొదటి కాన్పు గర్భిణులకు రూ.5 వేలు అందజేస్తారు. గర్భిణిగా 150 రోజుల లోపు నమోదు చేసుకున్న వారికి మొదటి విడతగా రూ.1,000, రెండో విడతగా 180 రోజులు దాటాక వైద్య పరీక్షల అనంతరం రూ.2 వేలు, ప్రసవం తర్వాత బిడ్డకు 105 రోజుల వయస్సు వచ్చే సమయానికి, మూడు మోతాదుల వ్యాధి నిరోధక టీకాలు వేశాక రూ.2 వేల చొప్పున అందిస్తారు. వ్యాధి నిరోధక టీకా విధానం డిజిటిలైజేషన్ చేయటం జరుగుతుంది. గ్రామ సచివాలయం వద్ద యూవిన్ పోర్టల్ ద్వారా బిడ్డ టీకా అందజేతకు సంబంధించిన ధ్రువపత్రాలను తల్లితండ్రులు ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

జననీ శిశు సురక్ష యోజన..

ఈ పథకం కింద ఆస్పత్రిలో మూడు రోజుల పాటు తల్లీబిడ్డలకు అవసరమైన చికిత్స, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు. పౌష్టికాహారానికి రూ.1,000 అందిస్తారు. కాన్పు అయిన ఆస్పత్రిలోనే జనన ధ్రువపత్రం జారీ చేస్తారు. పుట్టిన వెంటనే బిడ్డకు పోలియో, పచ్చకామెర్లు, క్షయ వంటి వ్యాధులు రాకుండా టీకా వేస్తారు.



తల్లీబిడ్డకు టీకాలు వేయిస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి, ఆరోగ్య సిబ్బంది

ప్రసవానంతర సేవలు..

ప్రసవానంతరం తల్లీబిడ్డలు ఇంటికి చేరాక 42 రోజుల వరకు ఆరు పర్యాయాలు మహిళా ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటికి వస్తారు. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ ఏమైనా అనారోగ్య సమస్యలుంటే మెరుగైన వైద్యానికి సిఫార్సు చేస్తారు.

వ్యాధి నిరోధక టీకాలు..

ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు నిర్దిష్ట కాల వ్యవధిలో టీకాలు వేస్తారు. పోలియో, క్షయ, కోరింత దగ్గు, గొంతు వాపు, ధనుర్వాతం, కామెర్లు, న్యుమోనియా, తరచూ విరేచనాల బారిన పడకుండా రోటా వైరస్ చుక్కలు, తట్టు, రూబెల్లా వంటి టీకాలు అందిస్తారు. ఏజెన్సీ కలబోసి ఉన్న జిల్లాలో మాతా శిశు సంరక్షణకు రక్షణకు సంబంధించిన వైద్య సేవలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించడం జరుగుతుంది. ఇప్పటికే గుర్తించిన గర్భిణీలకు 95 శాతం మేర టీకాలు వేయటం జరిగింది. ఈ క్రమంలో మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది.



నియోనాతల్ వాహనంలో బిడ్డకు సేవలు అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

73 వాహనాల ద్వారా..

గతంలో నియోజకవర్గానికి రెండు మాత్రమే 108 వాహనాలుండేవి. దీంతో జిల్లాలో 15 మండలాలకు సంబంధించి అత్యవసర సమయంలో సేవలు అందించటం కష్టతరమయ్యేది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఈ సేవలు విస్తృతం చేశారు. దీంతో జిల్లాకు 73 వాహనాలు అందుబాట్లోకి వచ్చాయి. వాటిలో 108 వాహనాలు 16, తల్లీబిడ్డ అంబులెన్స్‌లు(102) - 16,104 వాహనాలు 29, నవజాతి శిశు రక్షణ (నియోనాటల్) వాహనాలు 2 చొప్పున జిల్లాకు చేరాయి. తల్లీబిడ్డకు తక్షణ వైద్య సేవలు అందించడం ద్వారా మాతాశిశు మరణాల రేటు తగ్గిందచేందుకు ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ



ఏజెన్సీ అధికంగా ఉన్న ఈ జిల్లాలో గర్భిణుల వైద్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల హైరిస్క్ సమస్యలు గుర్తించేందుకు వీలుంటుంది. వారిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బిడ్డ రక్షణ, ఆరోగ్య స్థితిగతులు తెలుసుకునేందుకు గర్భిణులకు ఐదో నెలలో టిఫ్ఫా స్కాన్ ఉచితంగా చేయిస్తున్నాం. తద్వారా బిడ్డకు మరింత రక్షణ లభిస్తుంది. ఈ తరహా వైద్య సేవలను ప్రభుత్వం అందుబాట్లోకి తీసుకురావటంతో ఏజెన్సీలో తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ గతంకంటే బాగా మెరుగుపడింది.

– తెర్లి జగన్మోహనరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పార్వతీపురం మన్యం

కులవివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం..

పాలకొండ రూరల్: కులాల కుంపటి లేని స్వచ్ఛమైన సమాజం కోసం పోరాటాలు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నల్లబారిక గురుమూర్తి అన్నారు. మండలంలోని చిన్న మంగళాపురంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆకలి, అంటరానితనం లేని సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమ సమాజం కోసం నిరంతరం పోరాటాలు చేసిన మన్నెం ప్రసాద్‌ను గుర్తు చేసుకుంటూ ఈ నెల 10న నరసరావుపేటలో చేపట్టనున్న రాష్ట్రస్థాయి సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న కులనిర్మూలన పోరాటసమితి సభ్యులు

దారునాయక్‌పై చర్యలు తీసుకోండి

భామిని: ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొరపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్‌పై కఠిన చర్యలు తీసుకొని బర్తరఫ్ చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, గిరిజన సంఘాల నేతలు బత్తిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల గిరిజన సంఘ నాయకులు పత్తిక సింహాచలం, పిరపక శ్రీనివాసరావు, బిడ్డిక నూకయ్య, బిడ్డిక తమ్మారావు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, బి.ప్రసాద్ ఉన్నారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయ నిధి

వీరఘట్టం/భామిని: ముఖ్యమంత్రి సహాయనిధి అర్హులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. భామిని మండలం సతివాడ గ్రామానికి చెందిన దామోదర గణపతి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను ఎమ్మెల్యే కళావతి వండవలోని క్యాంపు కార్యాలయంలో శనివారం బాధితుడికి అందజేశారు. ఈ డబ్బుతో మెరుగైన చికిత్స చేయించుకోవాలని సూచించారు. పేదవాడికి కష్టం వస్తే ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో సచివాడ ఉప సర్పంచ్ దామోదర అప్పన్న, మండల రాకేష్, బోర శంకరరావు, పతివాడ పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

బస్ సర్వీసులు పెంచాలని వినతి

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ, చినకుదమ, కుందరతిరువాడ, నీచుకవలస, గ్రామాలకు బస్ సర్వీసులు పెంచాలని కోరుతూ ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి శనివారం వినతిపత్రం అందజేశారు. పెదకుదమ మీదుగా గెడ్డతిరువాడ వరకు రోజుకు 5 ట్రిప్పులు బస్సు సర్వీసు నడిచేదని, ప్రస్తుతం రెండు సార్లు మాత్రమే తిరుగుతోందని అన్నారు. గతంలో ఉదయం 5.30 నుంచి రాత్రి నైట్‌హాల్ట్ సర్వీసు వరకు ఐదుసార్లు నడవగా.. ప్రస్తుతం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు మాత్రమే బస్సు వస్తోందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. గతంలో మాదిరిగా ఐదు ట్రిప్పులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. డిపోమేనేజర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో బి.శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు, ఎస్.సింహాచలం తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న గెడ్డతిరువాడ, కుందరతిరువాడ గ్రామస్తులు

ప్రకృతి వ్యవసాయం ప్రతీ పల్లెకు విస్తరించాలి

- ఎక్స్ అఫీషియో ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం ప్రతీ పల్లెకు విస్తరించాలని ఎక్స్ అఫీషియో ప్రత్యేక కార్యదర్శి టి.విజయ్‌కుమార్ అన్నారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన భవన ప్రాంగణంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు అధ్యక్షతన శనివారం రజతోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.దమయంతి సహకారంతో నిర్మించిన కార్యాలయ భవనంను, అన్నపూర్ణేశ్వరీ సమేవేశ మందిరం, జట్టు గ్రంథాలయం గోడౌన్‌ను, సహజ ఎరువుల ఉత్పత్తి కేంద్రాన్ని విజయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జట్టు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జట్టు సంస్థ రూపొందించిన 'నేల తల్లికి వందనం.. మడిచేల తల్లికి వందనం' గీతాన్ని ప్రకృతి వ్యవసాయ ప్రార్థనా గీతంగా రాష్ట్రమంతా ఆచరించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులను సాధించడంతో పాటు ఆరోగ్యకర ఉత్పత్తులను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం టి.నాగార్జున, మేనేజింగ్ ట్రస్టీ ఎం.ప్రసాద్‌రావు, మాజీ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కంట్యాక్స్ తిరుమలరావు, డీపీఎం షణ్ముఖరాజు తదితరులున్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి: ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. గరుగుబిల్లి పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం అమలుతీరును శనివారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను, రక్తపరీక్షలను పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులు, ప్రత్యేక బ్లడ్‌గ్రూప్ కలిగినవారు, కాన్పు సమయం దగ్గరగా ఉన్నవారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరాతీశారు. వారి వద్ద ఉన్న మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలన్నీ పీహెచ్‌సీలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఐవీ, సిఫిలిస్, టీబీ, షుగరు నిర్ధారణ పరీక్షలు కచ్చితంగా చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భస్థ పిండం ఎదుగుదల తీరు, లోపాలను గుర్తించేందుకు జరిపే టిఫ్ఫా స్కానింగ్ ఇప్పుడు ఆరోగ్యశ్రీ అనుబంధ ఆస్పత్రుల్లో ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి చేర్చేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వం పీఎంఎంవీవై, జేఎస్‌వై, ఆరోగ్య ఆసరా తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్లు చిన్నమ్మి, ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

అభివృద్ధి బాట





పాలకొండ–రాజాం రహదారి రూపు మారింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా కనీస మరమ్మతులు చేయకపోవడంతో రహదారి మొత్తం గుంతలతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో రహదారి అభివృద్ధికి రూ.3.70 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. –పాలకొండ